క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన

లేపాక్షి: మండలంలోని గోపిందేవరపల్లిలో శుక్రవారం ఉదయం చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొబైల్ ఐసీటీసీ ద్వారా 56 మందికి హెచ్ఐవీ పరీక్షలు చేయించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ రాజగోపాల్, సబ్ సెంటర్ స్టాఫ్ హరి, ఎంఎల్‌హెచ్‌పీ శర్వాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: జిల్లెడుగుంట గ్రామంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి నరసయ్య, రవికుమార్ వారి అనుచరులను వైఎస్సార్‌సీపీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులైన పార్టీలోకి చేరామని వారు పేర్కొన్నారు.

పొలాలకు మట్టి తరలింపు

గోరంట్ల: మండలంలోని ఖాజాపురంలో సెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతుల పొలాలకు ఉచితంగా మట్టి తరలించేందుకు శ్రీకారం చుట్టారు. ఖాజాపురంలో 25 మంది రైతులను గుర్తించి, వెయ్యి ట్రాక్టర్ల మట్టిని పొలాలకు అందించేందుకు సంస్థ శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఖాజాపురం చెరువులో జేసీబీ ఏర్పాటు చేసి ట్రాక్టర్ల ద్వారా మట్టి తరలించే పనులు మందలపల్లి సర్పంచ్ ప్రమీలమ్మ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఉపాధి పనుల తనిఖీ



పెద్దగువ్వలపల్లి వద్ద ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రొద్దం: మండలంలోని పెద్దగువ్వలపల్లి సమీపాన జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ శుక్రవారం తనిఖీ చేశారు. పనులు, బిల్లులపై కూలీలతో ఆరాతీశారు. ప్రతి కూలీ రూ.272 వచ్చేలా పనులు చేయాలన్నారు. కూలీల సంఖ్య, మస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ నరసయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ షామీర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్

హిందూపురం: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ అల్లా చల్లనీ దీవెనలు అందించి సకల శుభాలు కలుగజేయాలని ఆకాంక్షించారు. నెల రోజులు చెడుకు దూరంగా ఉండి మంచి అలవాట్లు, మంచి మనస్సుతో ఎలా మెలిగారో అలాగే జీవితాంతం వాటిని అలవర్చుకోవాలన్నదే అల్లా సూచించే మార్గమన్నారు.

భూ సర్వే వేగవంతం చేయండి

గుడిబండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూసర్వే పూర్తయితే రైతులకు భూతగదాలు ఉండవన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరా, భూసర్వే డిప్యూటీ తహసీల్దార్ రాంభూపాల్‌రెడ్డి, ఆర్ఐ మహమ్మద్ బిలాల్, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

స్థల పరిశీలన



నివేదికను సీఎస్‌డీటీ పోతన్నకు అందిస్తున్న డాక్టర్ స్వరూపరెడ్డి తదితరులు

పరిగి: మండలంలోని ఊటుకూరులో మరో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక మండల ప్రజల కల నెరవేరింది. ఇటీవలే ప్రభుత్వం ఇద్దరు వైద్యాధికారులను సైతం నియమించింది. ప్రస్తుతం అధికారులు ఆస్పత్రి నిర్మాణ పనులపై దృష్టి సారించారు. గురువారం సీఎస్‌డీటీ పోతన్న, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ స్వరూపరెడ్డి వైద్య సిబ్బందితో కలిసి ఊటుకూరును సందర్శించారు. నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి స్థలం, ఆస్పత్రికి అవసరమైన మౌలిక వసతులు కల్పన తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గోరంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల తాగునీరు అందించడానికి శుక్రవారం చలివేంద్రాన్ని రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని తహసీల్దార్ రంగనాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నవరత్నాలతో ఇంటింటా సంతోషం



జిల్లెడుగుంటలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాల పథకాలతో ఇంటింటా సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. జిల్లెడుగుంట గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు అందించిన లబ్ధిని వివరించారు. ఏ ఇంటి వద్దకు వెళ్లినా వారిని ప్రజలు చిరునవ్వుతో స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరిచిన సంక్షేమ పథకాలు తమ కుటుంబంలో వెలుగు నింపాయని సంతోషాన్ని వ్యక్తం చేశారు. మళ్లీ సంక్షేమ పాలనకే మా దీవెనలు అందిస్తామని తెలిపారు. గ్రామంలో ప్రజలు తెలియజేసిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 46 నెలల పాలనలోనే 98 శాతం పైగా హామీలు అమలు చేయడంతోనే గడప గడప కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ పార్టీలకు అతీతంగాపథకాలను అందించిన ఘనత వైఎస్ జగన్‌దేనని తెలిపారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సరోజమ్మ, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామిరెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, వైస్ ఎంపీపీలు శ్రీరామరెడ్డి, ఎస్ఎస్ మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్, మాజీ ఎంపీపీ బజ్జప్ప, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్రయాదవ్, నాయకులు సత్యనారాయణ, జమ్మానిపల్లి మూర్తి, బాలకృష్ణారెడ్డి, రంగనాథ్, నాగభూషణరెడ్డి, హనుమంతరాయప్ప, ఎంపీడీఓ సొనిబాయి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌కే మా దీవెనలు



నా పేరు లక్ష్మమ్మ. జిల్లెడుగుంట గ్రామం. ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకం ద్వారా మా కుటుంబానికి రైతు భరోసా రూ.40,500, సున్నా వడ్డీ (రైతు) రూ.2,529, సున్నా వడ్డీ రూ.8,804, వైఎస్సార్ చేయూత రూ.18,750, పింఛన్ కానుక రూ.84,000, ఆసరా రూ.29,680, పంటల బీమా రూ.865 చొప్పున రూ.1,85,128 లబ్ధి పొందాం. మా దీవెనలు మళ్లీ వైఎస్ జగన్‌కే.

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాం



నా పేరు భాగ్యమ్మ. జిల్లెడుగుంట గ్రామం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్నాల పథకం ద్వారా ఇంటికి వైఎస్సార్ రైతు భరోసా రూ.36,500, పింఛన్ కానుక రూ.82,000, వైఎస్సార్ చేయూత రూ.37,500, పంటల బీమా రూ.5,826 చొప్పున మొత్తం రూ.1,61,826 లబ్ధి పొందాం. మా ఖాతాల్లోకే నగదు జమ చేయడం సంతోషంగా ఉంది. మళ్ళీ జగనన్నకే మా దీవెనలు అందించి సీఎంగా చేసుకుంటాం.



పీహెచ్‌సీ తనిఖీ



వైద్యులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కార్తీక్

చిలమత్తూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన రోగులతో మాట్లాడారు. గర్భిణులకు నిర్వహించే వైద్య పరీక్షలపై ఆరా తీశారు. ల్యాబ్‌ను తనిఖీ చేసి, వ్యాక్సిన్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం ఓపీ గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కోవిడ్ పరీక్షలు రోజూ నిర్వహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, వైద్యాధికారి రామకృష్ణ, వైద్యురాలు తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే తనిఖీలు



వలసలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీఓ విజయకుమార్‌రెడ్డి

అమరాపురం: మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికే తనిఖీలు చేస్తున్నట్లు డీపీఓ విజయకుమార్‌రెడ్డి, డీఎల్‌పీఓ బాలాజీ, డీఈఈ నాగరాజు, డీఈ మనునాయ్ పేర్కొన్నారు. శుక్రవారం వారు ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వలస ప్రాథమిక పాఠశాలను డీపీఓ విజయకుమార్‌రెడ్డి పరిశీలించారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద అమలు తీరుపై విద్యార్థులతో ఆరా తీశారు. పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, గదులు, బల్లలు తదితర వాటిని పరిశీలించారు. ప్రతి ఒక్క విద్యార్థి బాగా చదువుకోవాలని సూచించారు. అమరాపురం పీహెచ్‌సీలో డీఎల్‌పీఓ బాలాజీ హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సక్రమంగా విధులకు హాజరవుతున్నారా లేదా ఆరా తీశారు. మందుల గదికి వెళ్లి అన్ని రకాల మందులు ఉన్నాయా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఫార్మసిస్టును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ మనోహర్‌నాయక్‌తో మాట్లాడుతూ ఓపీ ఎంతమంది, రక్తహీనత సమస్యలు ఉన్న గర్భిణులు ఎంత మంది ఉన్నారు, వారికి ఎలాంటి మందులు ఇస్తున్నారు. రక్తహీనత పాగొట్టడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిని కలియదిరిగి ఏవైనా ఇంకా సమస్యలు ఉన్నాయా వాటిని తనకు తెలిపితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహాన్ని హౌసింగ్ ఈఈ నాగరాజు పరిశీలించారు. బీసీ బాలుర వసతి గృహాన్ని డీఈ మనునాయక్ తదితరులు సందర్శించారు. విద్యార్థులతో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల్లోని ఉద్యోగులతో మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. ఏవైనా ఎంపీడీఓ మునిస్వామి, ఈఓఆర్డీ సుధాకర్, ఎంఈఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



2వ వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు అందించే బాధ్యత సచివాలయ ఉద్యోగులపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. శుక్రవారం పట్టణంలోని 2, 3, 4వార్డుల్లో ఉన్న సచివాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. ప్రజల సమస్యలపై తక్షణం స్పందించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. వార్డు వలంటీర్లు కేటాయించిన ఇళ్లకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటికే పాలన, సంక్షేమానికి తీసుకురావడానికి సచివాలయ వ్యవస్థను అమలు చేశారని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి



సమస్యలు తెలియజేస్తున్న ఎంపీపీ ఈరన్న

అమరాపురం: మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ ఈరన్న డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజ్‌ను కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయాన్ని డిప్యూటీ సీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తదితర వాటిని ఆయన పరిశీలించారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ మండలంలో ఏవైనా సమస్యలు ఉన్నాయా ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి మండల పరిషత్ భవనం కారుతోందని, మరమ్మతు చేయించాలని డిప్యూటీ సీఈఓను కోరారు. స్పందించిన డిప్యూటీ సీఈఓ మండల పరిషత్ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. ఖాళీగా ఉన్న ఉద్యోగులను భర్తీ చేస్తామన్నారు. అనంతరం అమృత్‌రాజ్‌ను ఎంపీపీ ఈరన్న శాలువాతో సన్మానం చేశారు. ఎంపీడీఓ మునిస్వామి తదితరులు ఉన్నారు.

రొళ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని శుక్రవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి అభివృద్ధి పనులపై ఆరా తీశారు. మండల పరిషత్ సూపరింటెండెంట్ ఆరాధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రొళ్ల(అగళి): అగళి మండలం కంబదపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం జెడ్పీ డిప్యూటీ సీఈఓ అమృత్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అగళి ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. తర్వాత కంబదపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ఆందోళన

సోమందేపల్లి: మండలంలోని ఈదులబళాపురం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో సర్పంచు తనయుడు తనయుడు నాగభూషణరెడ్డి, అధికారులు ఉద్దేశ పూర్వకంగా అక్రమకట్టడాల పేరిట నోటీసులు ఇచ్చినట్లు వైస్ సర్పంచ్ అనిత ఆరోపించారు. సర్పంచ్ ఎన్నిల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చిన వారిపై కక్షగట్టినట్లు వారు తెలిపారు. సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణరెడ్డి కూడా వారికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించగా మెజార్టీ సభ్యులు అక్రమ కట్టడాలు కూల్చివేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకించినట్లు కార్యదర్శి శైలజ తెలిపారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలపై నోటీసులు ఇచ్చినట్లు సర్పంచ్ రామక్క తెలిపారు. ఎస్ఐ విజయ్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనాల అపహరణ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ వద్ద ద్విచక్ర వాహనం చోరీకు గురైనట్ల బాధితుడు ప్రభాకర్ శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి సాయి నగర్‌లో నాగప్ప అనే వ్యక్తికి చెందిన సూపర్ ఎక్సెల్, శుక్రవారం సాయంత్రం ఈదుళబలాపురానికి చెందిన బైలాంజి బైక్ వైఎస్సార్ సర్కిల్ వద్ద అపహరణకు గురయ్యాయి.

రంజాన్ సందడి

హిందూపురం: రంజాన్ పండుగ సందర్భంగా హిందూపురం సందడి నెలకొంది. ముఖ్యంగా ముక్కిడిపేట, రహమత్‌పురం ఏరియాల్లో జనం కిటకిటలాడారు. ముక్కిడిపేటలో చిన్నపిల్లలు, మహిళల చీరలు, బుక్కాలు, నక్కీ చీరలు డ్రస్సుల విక్రయాలు జోరందుకున్నాయి. ఆ ప్రాంతమంతా జనంతో నిండిపోయింది. అంతేగాక రోడ్డుపక్కనే పర్సులు, చెప్పులు, ఆటవస్తువుల విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

రౌండ్ టేబుల్ సమావేశం

రొద్దం: మండల కేంద్రంలోని డంపింగ్ యాడ్ వద్ద ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోలీస్‌లు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కోగిర, కంబాలపల్లి, శ్యాపురంలోని దళిత, గిరిజనులు వ్యవసాయ పనులు చేసుకుంటుంటే ఇటీవల స్వచ్ఛంద సంస్థ ముసుగులో కొందరు అసభ్య పదజాలంతో దూషించినట్లు తెలిపారు. తమపై మూకుమ్మడిగా దాడి చేసి దౌర్జన్యంగా మా భూముల్లోకి ప్రవేశించి, వ్యవసాయ పనులకు అడ్డుపడ్డారని వారు తెలిపారు. కార్యక్రమంలో కార్మిక వ్యవసాయ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, నారాయణప్ప, కిష్టప్ప, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

మడకశిరరూరల్: వైబీహళ్లి గ్రామ సచివాలయం పరిధిలోని పత్తికుంట, జాడ్రపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి మంజునాథ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు. నాయకులు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

మడకశిరరూరల్: హాస్టల్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి సిబ్బందిని ఆదేశించారు. నీలకంఠాపురంలోని బీసీ హాస్టల్‌ను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. హాస్టల్‌లో గదుల పరిశుభ్రత, విద్యార్థులకు అందించే భోజన నాణ్యత తదితర వాటిపై ఆరా తీశారు. విద్యార్థుల చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని వార్డెన్‌కు సూచించారు. సిబ్బంది విద్యార్థులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సక్రమంగా పౌష్టికాహారాన్ని అందిస్తూ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వార్డెన్ మహమ్మద్ హుస్సేన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో చోరీలు

మడకశిర: పట్టణంలోని పావగడ రోడ్డు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో గురువారం రాత్రి ఐదిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ కాలనీలో పలు ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. అస్లాం ఇంటిలో దొంగలు చిన్న ఎలక్ట్రిక్ మోటారు, రాధమ్మ ఇంటిలో ఎలక్ట్రిక్ మోటార్‌తో పాటు స్టౌ చోరీ చేశారు. సిగ్బత్, మంజు, కరియన్న ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఎస్ఐ సురేష్‌బాబు తన సిబ్బందితో కాలనీలో చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సామాజిక సేవ అలవర్చుకోవాలి

హిందూపురం: విద్యార్థులు సామాజిక సేవ అలవర్చుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి సూచించారు. బాలాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరభద్రప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం సూగురు ప్రాంతంలో ఎన్ఎస్ఎస్ పోగ్రాం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్లు చంద్రశేఖర్, రామకృష్ణ, నాగేంద్ర, బాలకృష్ణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మడకశిర(అగళి): అగళి మండలంలో ప్రవహించే సువర్ణ ముఖి నదిపై కర్ణాటక ప్రాంతంలో నిర్మించిన అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఇరిగేషన్ అధికారులకు పంపిన వినతి పత్రంలో ఎంపీపీ రేణుక కోరారు. ఎగువ ప్రాంతంలో కర్ణాటక వారు సువర్ణ ముఖి నదిపై అక్రమ కట్టడాలు కట్టి అగళి చెరువుకు నీరు రాకుండా అడ్డుకుంటున్నారని పేర్కొన్నారు. బ్రిటిష్ కాలంలో ఇరు ప్రాంతాలకు న్యాయం జరిగేలా ఏర్పాటు చేసిన కట్టడాలను కర్ణాటక ప్రాంతం వారు తొలగిస్తూ అగళి చెరువుకు నీరు రాకుండా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు అక్రమ కట్టడాలను తొలగించి అగళి చెరువుకు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా ఇరు ప్రాంతాలకు నీరు సమానంగా వచ్చే విధంగా ఏర్పాటు చేసిన కట్టడాలను మరమ్మతు చేయాలని కోరారు.

గ్రాట్యూటీ ఇవ్వాలని ధర్నా

హిందూపురం టౌన్: సూపర్ బి స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు వెంటనే గ్రాట్యూటీ ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మిల్లు గేటు ఎదుట ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ సూపర్ బీ మిల్లు యాజమాన్యం ఫ్యాక్టరీలో పనిచేసిన కార్మికులందరికీ గ్రాట్యూటీ వెంటనే ఇవ్వాలన్నారు. ఐదు నుంచి 20 సంవత్సరాల పాటు పని చేయించుకుని లాభాలు గడించి ప్రస్తుతం కార్మికులను రోడ్డుపాలు చేస్తున్నారన్నారు 15 రోజుల్లోపు సమస్య పరిష్కరిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, నాయకులు ఇస్మాయిల్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చలపతి, చేనేత కార్మిక సంఘం కో కన్వీనర్ వెంకటేశప్ప, ఫక్రుద్దీన్, కార్మికులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం

సోమందేపల్లి: ముద్దపుకుంట గ్రామ సమీపంలో 15 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం శివయ్య అనే వ్యక్తి అక్రమంగా కర్ణాటక మద్యం ప్యాకెట్లు తీసుకు వస్తుండగా అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

గోరంట్ల: గోరంట్లలోని 1,2, 4,5 వ అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా శిశుసంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి రాజశేఖరరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల హాజరు రిజిష్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందించాలని అన్నారు. కార్యక్రమంలో శిశుసంక్షేమశాఖ సూపర్‌వైజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మరు

- జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



జిల్లెడుగుంటలో మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

మడకశిరరూరల్: అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏమి చేయక దోచుకున్న టీడీపీ అధినేత చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మరని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. మడకశిర మండలం జిల్లెడుగుంటలో శుక్రవారం ఆమె ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఎంత తేడా ఉందో ప్రజలు గుర్తించాలన్నారు. ప్రజలను మోసగించడం, వెన్ను పోటుపొడవడం, కుట్ర రాజకీయాలు చేయడం చంద్రబాబు నైజమన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి, టీడీపీని ఇంటికి పంపించడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి విజ్ఞప్తి మేరకు జిల్లెడుగుంట తండాలో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల మద్దతు పెరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై అన్నివర్గాల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఉత్తమ క్యాడెట్‌లుగా నవోదయ విద్యార్థులు



ఉత్తమ క్యాడెట్‌లను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

లేపాక్షి: లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎన్‌సీసీ విభాగంలో ఉత్తమ క్యాడెట్‌లుగా ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం తెలిపారు. విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్న సి.ప్రవీణ్‌కుమార్ క్యాడెట్ వెల్ఫేర్ సొసైటీ కింద ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికయ్యారన్నారు. ఉత్తమ క్యాడెట్‌గా ఎంపికైనందుకు 6(ఎ) బెటాలియన్ ఎన్‌సీసీ కల్నల్ సందీప్‌ముంద్రా రూ.4 వేల చెక్కును పంపిణీ చేశారన్నారు. అలాగే 11వ తరగతి చదువుతున్న కె.వసంత్‌కుమార్ ద్వితీయ స్థానం సంపాదించి బహుమతిని అందుకున్నారన్నారు. వీరిని ఎన్‌సీసీ ఆఫీసర్లు ఆసఫ్అలీ మస్తాన్, అంబురాజన్ అభినందించారు.

జగనన్నతోనే అన్ని వర్గాలకు న్యాయం



పెనుకొండ రూరల్: మరువపల్లిలో సంక్షేమ పథకాలపై వివరిస్తున్న నాయకులు

పెనుకొండ రూరల్/హిందూపురం/పరిగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే బడుగు,బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. శుక్రవారం ' జగనన్నే మా భవిష్యత్ ' కార్యక్రమం పెనుకొండ మండలంలోని రాంపురం, కొండంపల్లి, హనుమప్పపల్లి, శెట్టిపల్లి, గోనిపేట గ్రామాల్లో నిర్వహించారు. నాయకులు నారాయణ యాదవ్, వెంకటేష్, చిన్న ఆంజనేయులు, నల్లప్ప, మదన్‌మోహన్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నారాయణస్వామి, గృహసారథులు చంద్ర, భాగ్యమ్మ పాల్గొన్నారు. అలాగే హిందూపురం పట్టణంలోని 21 ,27, 28వ వార్డులతోపాటు మండలంలోని సంతేబిదనూర్ పంచాయతీల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మారుతిరెడ్డి, నాగేంద్రమ్మ, మల్లికార్జున, సంతేబిదనూర్ సర్పంచ్ లలిత, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ పురుషోత్తంరెడ్డి, రాము, మణేసముద్రం గిరీష్, రవి తదితరులు పాల్గొన్నారు. పరిగి మండలంలోని పరిగి, మోదా, శ్రీరంగరాజుపల్లి, ఊటుకూరు, కొడిగెనహళ్లి తదితర గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీటీసీలు చంద్రారెడ్డి, అంజి, మాజీ ఎంపీపీ గోవిందప్ప, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ శంకర, నాయకులు మోహన్, మంజు, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.